సాక్షి
తిరుపతి
ఆదివారం । 11 । జూన్ । 2023



తెగనరుకుతూ..యుద్ధం చేస్తూ!
మహిషాసురిడిని వధించడమే లక్ష్యంగా చెంగాళమ్మ తల్లి యుద్ధం చేసే ఘట్టం విశేషంగా ఆకట్టుకుంది. - 8లో



ఐరన్ పరిశ్రమలో పేలుడు
ఓజిలి మండల పరిధిలోని ఓ ఐరన్ పరిశ్రమలో పెర్నిస్ బాయిలర్ పేలిన సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. - 8లో



	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	40	28
చిత్తూరు	38	27
తిరుమల	34	23
గూడూరు	42	30
నగరి	40	28

న్యూస్‌రీల్

పలువురు తహసీల్దార్ల బదిలీ

తిరుపతి అర్బన్: ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా కొనసాగుతున్నాయి. వ్యవసాయశాఖతోపాటు వాటి అనుబంధ విభాగాల్లోనూ పలువురు బదిలీ అయ్యారు. అదేవిధంగా ఆర్టీసీ, పోలీస్, ఇరిగేషన్ తదితర విభాగాల్లో బదిలీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే రెవెన్యూ విభాగంలోనూ పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేశారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న షేక్ జరీనాను సత్యవేడు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న శ్రీదేవిని కేవీబీపురం మండలానికి, అక్కడి తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డిని ఏర్పేడుకు బదిలీ చేశారు. ఏర్పేడు, పుత్తూరు తహసీల్దార్లు ఉదయసంతోష్, రోసయ్యను కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలిచ్చారు. నాయుడుపేటలో పనిచేస్తున్న పరమేశ్వరస్వామిని పుత్తూరు మండలానికి, చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన హనుమంతరావును బుచ్చినాయుడుకండ్రిగ మండలానికి, అక్కడి తహసీల్దార్ సుబ్రమణ్యంను తిరుపతి రూరల్‌కు, తిరుపతి రూరల్‌లోని లోకేశ్వరిని చిన్నగొట్టిగల్లుకు బదిలీ చేశారు. అదేవిధంగా పలువురు డిప్యూటీ తహసీల్దార్లను కూడా బదిలీశారు. ఆ మేరకు సోమవారం వారు బాధ్యతలు స్వీకరించనున్నారు.

భారీగా సెల్ ఫోన్లు స్వాధీనం



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: మొబైల్ హంట్ ద్వారా ఫిర్యాదు చేసిన 400 ఫోన్లను రికవరీ చేసినట్టు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. వీటి విలువ రూ.72 లక్షలు ఉంటుందన్నారు. మొబైల్ హంట్ వాట్సాప్ (9490617873) నంబర్‌కు ఫిర్యాదు చేస్తే సకాలంలో మొబైల్‌ను రికవరీ చేసేవిధంగా సహకరిస్తామన్నారు. ఆరు నెలల కాలంలో రూ.2,12,40,000 విలువచేసే 1,180 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. సెల్‌ఫోన్ పోగొట్టుకొన్న వెంటనే సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ సిటిజన్ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆయన వెంట ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, సైబర్ క్రైమ్ సీఐ రామచంద్ర ఉన్నారు.

22న వాచీలు టెండర్ కమ్ వేలం

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను ఈనెల 22న టెండర్ కమ్ వేలం వేయనున్నారు. ఇందులో టైటాన్, క్యాషియో, టైమెక్స్, ఆల్విన్, సొనాట, టైమ్‌వెల్, ఫాస్ట్‌ట్రాక్ కంపెనీల వాచీలు ఉన్నాయి. కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు మొత్తం 10 లాట్లు ఈ వేలంలో ఉంచారు. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని, 0877-2264429ను పనివేళల్లో సంప్రదించవచ్చు. లేదా టీటీడీ వెబ్‌సైట్ www.tirumala.org ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని టీటీడీ పేర్కొంది.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న చిద్విలాసం



చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి శనివారం బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి వారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాడు

టీడీపీ హయాంలో సగం విద్యాసంవత్సరం గడిచిపోతే కానీ పిల్లలకు పాఠ్యపుస్తకాలు అందించేవారు కాదు. యూనిఫామ్ అయితే అసలు ఇస్తారో.. లేదో తెలియని పరిస్థితి. కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ సర్కారు బడులను పట్టించుకునేవారు కాదు. విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించే సంగతి దేముడెరుగు.. కనీస మౌలిక వసతులు కూడా ఉండేవి కావు. దీంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటే తల్లిదండ్రులు వెనకడుగు వేసేవారు.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్కారు బడులను బలోపేతం చేయడంపైనే దృష్టి సారించింది. విప్లవాత్మకమైన పథకాలను విద్యారంగం అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తోంది. పాఠశాలల ప్రారంభం రోజునే పిల్లలకు జగనన్న విద్యాకానుక కింద పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ తదితర సామగ్రితో కిట్‌లను అందిస్తోంది. ఆహ్లాదకర వాతావరణంలో విద్యాభ్యాసం చేసేందుకు వీలుగా కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా వసతులు సమకూర్చింది. దీంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను సంతోషంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే సుహృద్భావ పరిస్థితిని కల్పించింది.



కిట్‌లోని కానుకలు ఇవే!
- మూడు జతల యూనిఫామ్ క్లాత్ (కుట్టు కూలి సైతం చెల్లిస్తారు)
- జత బూట్లు, రెండు జతల సాక్సులు
- బెల్టు, స్కూల్ బ్యాగు
- పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్- తెలుగు డిక్షనరీ

జిల్లా సమాచారం

మొత్తం పాఠశాలలు	విద్యార్థులు
2,338	1,66,664

నియోజకవర్గాల వారీగా పంపిణీ చేయనున్న కిట్లు

నియోజకవర్గం	కిట్లు
చంద్రగిరి	20,181
గూడూరు	27,555
నగరి	8,738
సత్యవేడు	27,854
శ్రీకాళహస్తి	26,583
తిరుపతి	14,803
వెంకటగిరి	13,851
సూళ్లూరుపేట	27,099

భవితకు పెట్టు‘బడి’

“ విద్యపై ఎంత వెచ్చించినా.. అది భవిష్యత్‌కు పెట్టుబడే అవుతుంది. సమాజంలో అసమానతలను చదువుతోనే రూపుమాపగలం. విద్యతోనే పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యం” ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇందు కోసం ఏటా బడ్జెట్‌లో రూ.వేల కోట్లు కేటాయిస్తున్నారు. ఖర్చు పెట్టే ప్రతిపైసాను పిల్లల ఉన్నత చదువుకే ఉపయోగపడేలా పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్నారు. అందులో భాగంగా బడులు ప్రారంభమయ్యే తొలిరోజు ఈ నెల 12వ తేదీన జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు తదితర సామగ్రితో కూడిన కిట్‌లను పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేశారు.

- రేపే పాఠశాలల పునఃప్రారంభం
- తొలిరోజునే జగనన్న విద్యాకానుక పంపిణీ
- నాణ్యమైన సామగ్రితో కూడిన కిట్‌లు
- పకడ్బందీగా అందించేందుకు సన్నాహాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో శ్రమిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా పథకాలను అమలు చేస్తున్నారు. పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఏటా బడులు తెరిచే రోజే జగనన్న విద్యాకానుక కిట్‌లను అందిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 12వ తేదీన జిల్లాలోని అన్ని సర్కారు బడుల్లో పండుగలా విద్యాసామగ్రి కిట్‌లను పంపిణీ చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

నాణ్యతాప్రమాణాల మేరకు..

జగనన్న విద్యాకానుక కిట్‌లను నాణ్యతాప్రమాణాలకు మేరకే సిద్ధం చేశారు. విద్యార్థులకు బ్రాండెడ్ వస్తువులను అందించేలా చర్యలు చేపట్టారు. ఆయా సామగ్రి నాణ్యతను స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉన్నతాధికారులు పరిశీలించిన తర్వాతే జిల్లా కేంద్రాలకు తరలించారు.



తిరుపతిలో బూట్ల నాణ్యత పరిశీలిస్తున్న విద్యాప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్(ఫైల్)

ఇది కదా విజన్ అంటే..!

గతంలో టీడీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను కార్పొరేట్‌కు హస్తగతం చేసిందని పలువురు విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. సర్కారు బడుల్లోని విద్యార్థుల కోసం జిల్లాలో ఏటా కేవలం రూ.68 కోట్లు మాత్రమే వెచ్చించేవారని గుర్తుచేస్తున్నారు. అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాల కింద జిల్లాలో ఏటా రూ.1,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారని వివరిస్తున్నారు. భవిష్యత్ తరాల అభ్యున్నతిని ఆలోచించి కార్యాచరణ అమలు చేయడమే కదా నిజమైన విజన్ అని కొనియాడుతున్నారు.



విద్యార్థులకు అందజేసే విద్యాకానుక కిట్‌లోని వస్తువులు

మొదటి రోజే కిట్‌ల పంపిణీ



ప్రభుత్వ ఆదేశాల మేరకు జేవీకే కిట్లను బడులు తెరిచిన మొదటి రోజు పకడ్బందీగా పంపిణీ చేస్తాం. స్థానిక ప్రజాప్రతినిధుల చేతులమీదుగా విద్యార్థులకు అందించాలని అధికారులకు స్పష్టం చేశాం. ప్రతి సర్కారు పాఠశాలలో వంద శాతం విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.
– కే.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

నాణ్యమైన సామగ్రి



సర్కారు బడుల్లోని విద్యార్థులకు ప్రభుత్వం విద్యాకానుక కిట్‌లను అందించడం గొప్ప విషయం. అందులోని సామగ్రి నాణ్యంగా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. మేము కూడా క్షేత్రస్థాయిలో జేవీకే స్టాక్ పాయింట్లను సందర్శించాం. వస్తువుల నాణ్యతను పరిశీలించాం. కిట్‌ల పంపిణీని సబంధిత డీవైఈఓలు, ఎంఈఓలు పకడ్బందీగా పర్యవేక్షించాలని స్పష్టచేశాం.
డాక్టర్ వి.శేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి, తిరుపతి

ప్రతి విద్యార్థికీ అందిస్తాం



జిల్లా వ్యాప్తంగా సర్కారు బడుల్లోని ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్‌ను అందిస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో చేపట్టిన కసరత్తును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఒకటి నుంచి పదోతరగతి వరకు విద్యార్థులకు జేవీకే కిట్‌లను పకడ్బందీ పంపిణీ చేసేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాం. ఈ కిట్‌లు పిల్లలకు చాలా ఉపయోగకరం.
జి.సురేష్, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్, తిరుపతి

బదిలీలు.. ఉద్యోగోన్నతుల్లో నిబంధనలు తప్పనిసరి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉద్యోగోన్నతులు, బదిలీల్లో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఈవో వీ.శేఖర్ ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగోన్నతి పొందిన టీచర్లు, 8 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న, సర్‌ప్లస్, సబ్జెక్ట్ కన్వర్షన్ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. 2008 ఎంటీఎస్ టీచర్లు పూర్వపు పాఠశాలల్లోనే కొనసాగుతారన్నారు. ఈ నెల 12వ తేదీన ఎక్కడైనా పాఠశాల మూతపడితే సంబంధిత ఎంఈఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతిలో మార్పు పొందిన స్కూల్ అసిస్టెంట్లను తక్షణమే రిలీవ్ చేసి నూతన పాఠశాలలో చేర్చుకోవాలని ఆదేశించారు. పండుగ వాతావరణంలో జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

24 నుంచి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జూన్ 22న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేయనున్నారు.

సజావుగా సుపరిపాలన



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి. చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, సీఈఓ ప్రభాకరరెడ్డి



పాల్గొన్న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

- గృహనిర్మాణాల్లో ముందంజ
- పకడ్బందీగా నీటి ఎద్దడి నివారణ
- నిరంతరం నాణ్యమైన విద్యుత్
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో ఎలాంటి సమస్యలు లేకుండా సజావుగా సుపరిపాలన సాగుతోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. శనివారం చిత్తూరులో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. రాబోయే ఆరు నెలల్లో 32 వేల గృహాలను నిర్మించాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు వెల్లడించారు. రైతులకు 9గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తున్నామని చెప్పారు. గతంలో వ్యవసాయ సర్వీసులకు 20వేల దరఖాస్తులు పెండింగ్ ఉండేవని, వాటిని 1,100లకు తీసుకువచ్చామని వివరించారు. పరిశ్రమలకు మరింత మెరుగ్గా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గృహ వినియోగదారులకు 24గంటల విద్యుత్ అందిస్తున్నామన్నారు. గ్రామీణ నీటి సరఫరాశాఖ ద్వారా పెండింగ్‌లో ఉన్న రూ.43.85 కోట్ల ట్యాంకర్ల నీటి బిల్లులను చెల్లించామని వెల్లడించారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి రూ.50 కోట్లు విడుదల చేశామని చెప్పారు. పశ్చిమ మండలాల్లో శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.2వేల కోట్లతో ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు. నాడు–నేడు కింద పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నామని, ఆరోగ్యశ్రీ కింద వేలాది వ్యాధులకు ఉచితంగా చికిత్సలు అందిస్తున్నామని వివరించారు. ప్రతి మండలానికి ఉపాధిహామీ పథకం కింద రూ.60 లక్షల పనులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు.

- **జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు :** పాఠశాలలు సోమవారం ప్రారంభమవుతున్నందున అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి. విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్‌లను పంపిణీ చేయాలి. నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. ఫ్యామిలీ డాక్టర్ కింద ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్నాం. మంత్రి పెద్దిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం. పదోతరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు పథకం కింద సత్కరించనున్నాం. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నాం. బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత నివారణకు వైద్యసిబ్బంది కృషి చేయాలి.
- **సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం :** సచివాలయ పరిధలోని వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు సబ్సిడీ ఎరువుల, విత్తనాలు, ఉచిత విద్యుత్‌పై రైతులకు అవగాహన కల్పించాలి. సత్యవేడులోని గురుకుల పాఠశాలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలి. తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చాలి.
- **జెడ్పీటీసీ సభ్యులు :** గంగవరం మండలం గుండిగుట్లు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు విధులకు సక్రమంగా హాజరుకావడంలేదు. సత్యవేడు, శ్రీకాళహస్తిలో గృహ నిర్మాణాల పురోగతి నత్తనడకన సాగుతోంది. వీటిపై మంత్రి పెద్దిరెడ్డి, కలెక్టర్ స్పందించారు. తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెడ్పీ వైస్ చైర్మన్లు ధనంజయ రెడ్డి, రమ్య, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుబాల, ఎన్ఆర్‌జీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విశ్వనాథ్, జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీధర్, ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ విజయ్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు తులసి, గంగాభవాని, ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

12న కౌన్సెలింగ్‌కు హాజరుకండి

- సమగ్ర శిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వివిధ కేడర్ల కేజీబీవీ ఉద్యోగులు ఈనెల 12న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సమగ్ర శిక్ష శాఖ జిల్లా ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ ఉత్తర్వుల మేరకు బదిలీలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 12 న మధ్యాహ్నం 2 గంటలకు చిత్తూరు జిల్లా సమగ్ర శిక్ష శాఖ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. బదిలీలకు కేజీబీవీ ప్రిన్సిపల్స్ 6, సీఆర్‌టీలు 22, పీటీటీ 1, ఏఎన్ఎం 1, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు 3.. మొత్తం 33 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. బోధన, బోధనేతర సిబ్బంది సంబంధిత ధ్రువ పత్రాలతో హాజరుకావాలన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

పిచ్చాటూరు: నాగలాపురం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం చోరీకి దుండగులు విఫలయత్నం చేశారు. వివరాలిలు.. స్థానిక వీకేఎం వీధిలో కొన్ని రోజులుగా వాచ్‌మన్ లేదు. దీన్ని గుర్తించిన దుండగులు శుక్రవారం అర్ధరాత్రి దాటాక 1.40 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంలోకి ప్రవేశించారు. సీసీ కెమెరాల్లో చిత్రాలు కనిపించకుండా లెన్స్‌పై పొగను పిచికారీ చేశారు. తర్వాత ఏటీఎం యంత్రం తాళాలను గ్యాస్ కట్టర్‌తో కరిగించడానికి యత్నించారు. ఇది ఫలించకపోవడంతో వారు వెనుతిరిగారు. శనివారం బ్యాంకు సిబ్బంది ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ హనుమంతప్ప పరిశీలించి బ్యాంకు సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు.

తెగనరుకుతూ..యుద్ధం చేస్తూ!

- ఘనంగా మహిషాసుర మర్ధనం
- మహిషాసురిడి తల నరికిన చెంగాళమ్మ
- యుద్ధ ఘట్టాన్ని ఆసక్తిగా తిలకించిన భక్తజనం
- సింహ వాహనంపై విజయగర్వంతో ఊరేగిన అమ్మవారు



తరలివచ్చిన అశేష భక్త జనం (ఇన్‌సెట్) మహిషాసురుడిని వధిస్తున్న అమ్మవారి ప్రతినిధి

సూళ్లూరుపేట: అమ్మవారిపై దండెత్తడానికి వచ్చిన మహిషాసురుడిని వధించడమే లక్ష్యంగా శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి తల్లి అతనితో యుద్ధం చేసే ఘట్టం ఆద్యంతం ఆకట్టుకుంది. చెంగాళమ్మ తల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం సాయంత్రం సుళ్ల ఉత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. గంగపెట్టితో యాదవులు బొల్లిఆవు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారు వివిధ ఆయుధాలు ధరించి గ్రామ పర్యటనకు బయలుదేరగా.. అదే సమయంలో మహిషాసురుడు అనే రాక్షసుడు దేవతలను వేధించడం ప్రారంభించగా.. చెంగాళమ్మ తల్లి అతనిపై యుద్ధం ప్రకటిస్తుంది. సింహ వాహనంపై అమ్మవారు ముందుకు సాగారు. ఆమె ముందు ఆలయ ధర్మకర్త దువ్వూరు బాలచంద్రారెడ్డి అమ్మవారి ప్రతినిధిగా రెండు మూరల కత్తితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. మహిషాసురుడు అమ్మవారిని అంతమొందించేందుకు దగ్గరకు రాగానే అతన్ని తరుముకుంటూ వెళ్లి ధర్మకర్త తన చేతిలోని కత్తితో ఆ రాక్షసుడి తల తెగనరకడం.. మహిషుడు మళ్లీ తన మాయాజాలంతో వేరే తల ధరించి యుద్ధానికి రావడం.. ఇలా తొమ్మిది సార్లు తొమ్మిది రకాల జంతువుల తలలతో అమ్మవారిపై యుద్ధానికి రావడం.. అమ్మవారు ఓడించడం ఆకట్టుకుంది. ఆఖరులో మహిషుడు దున్నపోతు తలతో యుద్ధానికి రావడంతో అమ్మవారి ప్రతినిధిగా ధర్మకర్త బాలచంద్రారెడ్డి అతన్ని వెంబడించి తలనరకడంతో ఈ యుద్ధ ఘట్టం ముగిసింది. ఈ యుద్ధాన్ని చూసేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. మహిషాసురమర్ధనం అనంతరం సింహ వాహనంపై అమ్మవారు గ్రామంలో విజగర్వంతో పర్యటించారు. తర్వాత కాళంగినదీ తీరాన ఏర్పాటు చేసిన బాణ సంచా వేడుక ఆకట్టుకుంది. సుమారు రెండు గంటపాటు ఆగకుండా వివిధ రకాల బాణసంచాతో ఆ ప్రాంతాన్ని పట్టపగలుగా మార్చేశారు.

నేటి కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు సుళ్ల ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. మొదటిరోజున సుడిమానుకు మనిషి నమస్కారం చేసే బొమ్మను కట్టి తిప్పనున్నారు. ఆదివారం సాయంత్రంతో మూడో రోజు సుళ్ల ఉత్సవాలు ముగియనున్నాయి.



బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు సుళ్లు ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



యాదవులతో కలిసి వీరతాడు వేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి

వాహనాలు సహా ఎర్రచందనం స్వాధీనం

- 8 మంది స్మగ్లర్ల అరెస్ట్
- పరారీలో అంతర్‌రాష్ట్ర స్మగ్లర్



పట్టుబడ్డ వాహనాలు, ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లతో పోలీసులు సిబ్బంది

భాకరాపేట : వాహనాలు సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక సీఐ తులసీరాం తెలిపారు. ఈ మేరకు ఆయన భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు మండలం, చిట్టేచెర్ల పంచాయతీ, భూతంవారిపల్లె సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం అందడంతో పోలీసులతో కలిసి దాడులు నిర్వహించామన్నారు. దేవరకొండ ప్రాంతం నుంచి అతి వేగంగా వస్తున్న వాహనాలను అడ్డుకోగా.. వాటిలో ఎర్రచందనం దుంగలతో పాటు స్మగ్లర్లు ఉన్నారని తెలిపారు. వారు వాహనాన్ని వదలి పారిపోవడానికి ప్రయతించగా భాకరాపేట ఎస్ఐ ప్రకాష్‌కుమార్, ఎర్రావారిపాళెం ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి చుట్టిముట్టినట్టు వెల్లడించారు. ఈ దాడుల్లో అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ తంజి, మరో స్మగ్లర్ శివమణి పారిపోయారన్నారు. స్మగ్లర్ తంజిపై 20 ఎర్రచందనం కేసులు ఉన్నట్లు వెల్లడించారు. పట్టుబడ్డవారిలో చిత్తూరు పట్టణానికి చెందిన గణేష్, తమిళనాడు రాష్ట్రానికి చెందిన తంగరాజ్, ఆనంద్, విజయ్‌రాశు, రాజేష్, రాజా, విఘ్నేష్, తిరుపతి ఉన్నారని తెలిపారు. వీరిని అరెస్టు చేసి తిరుపతి కోర్టులో హాజరు పరిచినట్టు పేర్కొన్నారు. పట్టుబడ్డ వాహనాలు, ఎర్రచందనం దుంగల విలువ రూ.21,67,400 ఉంటుందన్నారు. దాడుల్లో ఎస్ఐలు ప్రకాష్‌కుమార్, వెంకటేశ్వర్లు, పోలీసులు పాల్గొన్నారు. ఈ మేరకు సిబ్బందిని చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో డిజిటల్ అసిస్టెంట్ మృతి

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డిజిటల్ అసిస్టెంట్ లలిత(25) మృతి చెందింది. ఏర్పేడు సీఐ శ్రీహరి అందించిన వివరాలు.. తిరుపతి జిల్లా, వడమాలపేట గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లలిత ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళ్తున్నారు. అదే సమయంలో వెంకటగిరి నుంచి తిరుపతికి వెళుతున్న బొలేరో వాహనం ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లలిత అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



లలిత మృతదేహం

నెల్‌క్యాస్ట్ ఐరన్ పరిశ్రమలో పేలుడు

- ముగ్గురికి తీవ్రగాయాలు

ఓజిలి: మండల పరిధిలోని పెదపరియ సమీపంలోని నెల్‌క్యాస్ట్ ఐరన్ పరిశ్రమలో శుక్రవారం రాత్రి పెర్నిస్ బాయిలర్ పేలిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు వివరాలు మేరకు.. పెదపరియ పంచాయతీ పరిధిలోని నెల్‌క్యాస్ట్ ఐరన్ పరిశ్రమలో శుక్రవారం రాత్రి బాయిలర్ వద్ద కర్మికులు పని చేస్తున్నారు. పరిశ్రమలోని బాయిలర్ ఒక్కసారిగా పేలింది. నిప్పు రవ్వలు రాజేంద్రసింగ్, కురవబెస్తా, వికాస్ ఓరాన్‌పై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన యాజమాన్యం ముగ్గురు క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించింది. అక్కడి నుంచి మెరుగైన వైద్య కోసం చెన్నైకి తరలించింది. ఎస్ఐ దారం ఆదిలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. అనంతరం చెన్నైలో చికిత్స పొందుతున్న కార్మికుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని డీలర్‌కు అప్పగిస్తున్న అధికారులు

దొరవారిసత్రం: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 2,660 కిలోల రేషన్ బియ్యాన్ని తిరుపతి విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన శనివారం కలగుంట-నేలపట్టు మార్గంలో చోటుచేసుకుంది. స్థానిక సీఎస్ డీటీ ఓబయ్య కథనం.. విజిలెన్స్ అధికారులతో కలిసి కలగుంట-నేలపట్టు గ్రామాల మధ్య రోడ్డుపై 55 ప్లాస్టిక్ గోతాల్లో ఉన్న 2,660 కేజీల రేషన్ బియ్యాన్ని గుర్తించి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న సూళ్లూరుపేట పట్టణ ప్రాంతానికి చెందిన వేనాటి మునిచంద్రను అదుపులోకి తసుకున్నారు. డీవీ సత్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పట్టుబడిన వ్యక్తిని స్టేషన్‌లో అప్పగిచినట్లు డీటీ తెలిపారు. స్థానిక ఎస్ఐ తిరుమరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు ప్రోత్సాహానికి దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న రమణన్

తిరుపతి కల్చరల్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉన్నత చదువులు చదువుతున్న కరణం, కరుణీగర్ కులానికి చెందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి కరుణీగర్ అభ్యుదయ సంఘం కార్యదర్శి సి.రమణన్ తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రమణగిరి జయంతి సందర్భంగా ప్రతి ఏటా విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్నట్టు తెలిపారు. ఎంబీబీఎస్, బీడీఎస్, అగ్రికల్చర్, బీఎస్సీ, బీటెక్, వెటర్నరీ వంటి కోర్సులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ నెల 20వ తేదీలోపు తమ తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నంబర్, చిరునామా, స్టడీ సర్టిఫికెట్, తెలుపు రేషన్ కార్డు, గత ఏడాది సెమిస్టర్ మార్కులిస్టులను జత చేయాలని సూచించారు. దరఖాస్తులను ప్రొఫెసర్ వి.శ్రీధర్, డోర్ నం20-3-15 హెచ్/సీ, శివజ్యోతినగర్, సాయిబాబా గుడి వద్ద, తిరుపతి-517507 చిరునామాకు పంపాలని తెలిపారు. వివరాలకు 9849507843లో సంప్రదించాలని కోరారు. ఈ నెల 25న తిరుపతి కరుణీగర్ అభ్యుదయ సంఘం సర్వసభ్య సమావేశంతో పాటు వివాహ పరిచయ వేదిక, బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.